అభివృద్ధికి సహకరిస్తా

ఎమ్మెల్యే హరీశ్‌రావు


హరీశ్‌రావును కలిసిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహకారం ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేటలో ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ, కౌన్సిలర్లు ఆస యాదగిరి, గోనెపల్లి దేవలక్ష్మీ, మూర్తి సంధ్యారాణి మర్యాద పూర్వకంగా కలిశారు. వైస్ చైర్‌పర్సన్ సుగుణ తన కుమారుడి వివాహానికి రావాలంటూ శుభలేఖ అందజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

తొగుట(దుబ్బాక): రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని తొగుట మాజీ ఎంపీపీ గంట రేణుక అన్నారు. మంత్రి కొండా సురేఖ మల్లన్న సాగర్ నుంచి బుధవారం రాత్రి నీటిని విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. దీంతో మల్లన్న సాగర్ కాలువ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి పంటల సాగుకోసం ప్రభుత్వం నీటిని విడుదల చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

మృతదేహం వెలికితీత

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి చెరువులోపడి మృతిచెందిన యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో గురువారం వెలికితీసినట్లు తొగుట ఎస్‌ఐ లింగం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన యువకుడు నజీముద్దీన్(19) బుధవారం పెద్ద మాసాన్‌పల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోదరులు, బంధువుల యువకులతో కలిసి గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. చెరువులోకి దిగి ఈత కొడుతుండగా నీటిలో మునిగిపోయాడు. అప్రమత్తమైన యువకులు అతడి కోసం చెరువులో గాలించినా ప్రయోజనం లేకుండాపోయింది. గురువారం గజ ఈతగాళ్ల సాయంతో యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తండ్రి మొయినుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తే కఠిన చర్యలు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములలో వెంచర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బెజ్జంకి తహసీల్దార్ శ్యామ్ హెచ్చరించారు. మండలంలోని పోతారం శివారులో కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను గురువారం పరిశీలించి, పాతిన కడీలను సిబ్బందితో తొలగించారు. అన్ని అనుమతులు వచ్చాకే ప్లాట్‌లు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. అనుమతులున్న ప్లాట్‌లను మాత్రమే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన శానగొండ శరత్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్, కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలి

గజ్వేల్‌రూరల్: గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండా వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గజ్వేల్‌లో డిప్యూటీ తహసీల్దార్ భార్గవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందించారన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ సమయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

గజ్వేల్‌రూరల్: ప్రతీనెల క్రమం తప్పకుండా పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఐవోసీల ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ అరిఫాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించడం వల్ల గ్రామాల్లో అసమానతలు తొలగి ప్రజలంతా అన్నదమ్ముల్లా కలసిమెలిసి ఉండే అవకాశముందన్నారు.

బైండ్ల కులస్తులను ఆదుకోవాలి

బైండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను బైండ్ల కులస్తులకు వర్తింపజేసి ఆదుకోవాలని బైండ్ల భవనీయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. బైండ్ల భవనీయ సంఘం మండల సమావేశం గురువారం చిన్నకోడూరు ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా బచ్చలి బాలకిషన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పూజారులైన బైండ్ల పూజారులకు మాత్రమే అమ్మవారికి పట్నాలు వేసే హక్కు ఉందన్నారు. ఒగ్గు పూజారుల ఆగడాలను నియంత్రిస్తామన్నారు. బైండ్ల కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి భరత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి గణేష్, కార్యదర్శి బాబు, నాయకులు సుధాకర్, ప్రసాద్, రాంబాబు, శ్రీనివాస్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(ఎర్రవల్లి) అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటైంది. సంఘం అధ్యక్షుడిగా సుంచు యాదగిరి, గౌరవ అధ్యక్షుడిగా ఆకారం రాజు, కార్యవర్గ సభ్యులుగా శివకుమార్, ఇస్తారి, లక్ష్మణ్, శ్రీనివాస్, లింగం, ఎల్లం, అశోక్, స్వామి, రాజు, కృష్ణ, నాగరాజు, మల్లయ్య, రాజమల్లు, యాదయ్య ఎన్నికయ్యారు.

నవ యువ ఓటర్ల సమ్మేళనం

గజ్వేల్‌రూరల్: నవ యువ ఓటర్ల సమ్మేళనంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని గజ్వేల్ బీఎంఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం వీక్షించారు. ఇందుకోసం కళాశాల ఆవరణలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అనంతరం బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ యువతకు మోదీ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

దౌల్తాబాద్(దుబ్బాక): గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండోరా శివరాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను గ్రామ పంచాయతీ సిబ్బంది విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు.

అసంపూర్తిగా ఫంక్షన్ హాల్

- నత్తనడకన సాగుతున్న నిర్మాణ పనులు
- ఏళ్లు గడుసున్నా పూర్తికాని వైనం
- వెంటనే పూర్తిచేయాలని డిమాండ్


తిమ్మాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గత ప్రభుత్వం గ్రామాల్లో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ఒక్కో నిర్మాణానికి రూ.కోటికిపైగా నిధులు మంజూరు చేసింది. మండలంలోని చాలా చోట్ల నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొనసాగుతునే ఉన్నాయి. ఉమ్మడి జగదేవ్‌పూర్ మండలంలో 29 గ్రామాలు ఉన్నాయి. పీర్లపల్లి, బిజి వెంకటాపూర్ గ్రామాల్లో మాత్రమే పూర్తికావడంతో వాటిని ప్రారంభించారు. మిగిలినవి పూర్తి కాలేదు. తమ హయాంలోనైనా ప్రారంభిద్దామనుకున్నా సర్పంచ్‌ల పదవీ కాలం ఈనెల 31వ తేదీతో పూర్తి కానుండటంతో వారికి ఆశలు అడియాశలయ్యాయి. తిమ్మాపూర్ గ్రామంలో ఐదేళ్లుగా నిర్మాణ పనులు సాగుతునే ఉన్నాయి. జగదేవ్‌పూర్, ఇటిక్యాల, వట్టిపల్లి, చాట్లపల్లి, చిన్నకిష్టాపూర్ గ్రామాల్లో మాత్రమే నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. మిగతా చోట్ల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నాలుగేళ్ల కింద నిర్మాణం చేపట్టిన ఫంక్షన్ హాల్ పనుల్లో జాప్యం జరగడంతో చేసిన పనులన్నీ మరమ్మతుకు చేరాయి. పంచాయతీ రాజ్ ఏఈ దేవయ్యను వివరణ కోరగా ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచుతామన్నారు.

సాగులో సస్యరక్షణ చేపట్టాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చేపట్టాలని ఏడీఏ పద్మ, శాస్త్రవేత్త శ్రీదేవి సూచించారు. గురువారం మండల పరిధిలోని పెద్దకోడూరు, మెట్‌పల్లి, చిన్నకోడూరు గ్రామాల్లో వరి, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో పిలక దశలో ఉన్న పొలాల్లో నాచు ఎక్కువగా ఉండటం వల్ల ఎదుగుదల లోపిస్తుందన్నారు. దీని నివారణకు ఆరుతడి విధానంలో మూడు రోజులకొకసారి నీరు మార్చాలన్నారు. మొక్కలకు గాలి, వెలుతురు అందేలా చేతులతో మొక్కల వేర్ల దగ్గర కదపాలన్నారు. దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్ కుమార్, సరిత, మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధికి కృషి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


మిరుదొడ్డిలో డివైడర్ స్ట్రీట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లింగుపల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణం, కాసులాబాద్‌లో మహిళా సమాఖ్య భవనం, మిరుదొడ్డిలోని రోడ్డు డివైడర్ స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. ధర్మారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పల్లెలను అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. కేంద్ర రాష్ట్ర పథకాలు అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, కోఆప్షన్ మెంబర్ అహ్మద్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్ రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు జోగ్యారి బాల్ నర్సింహులు, రంగనబోయిన రాములు, గూళ్ళ పుష్ప బాగులు, కాలేరు శ్రీనివాస్, పిట్ల సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు వినియోగించుకోవాలి

సిద్దిపేటరూరల్: రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటుహక్కును ప్రతీ పౌరుడు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని రూరల్ తహసీల్దార్ సలీం అన్నారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మొదటిసారి ఓటుహక్కు పొందిన యువతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలయ్య, సర్పంచ్ ఏర్వ రమేశ్, సెక్రటరీ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ సుమతి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.